క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం డివిజన్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. వసంత్‌నగర్‌, 5వ ఫేజ్‌, 6వ ఫేజ్‌లలో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం వార్డు కార్యాలయంలో మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పదేళ్ల కాలంలో కేసీఆర్‌ సారథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావు నాయకత్వంలో డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తి అయ్యాయని, పెండింగ్‌లో ఉన్న పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

జోనల్‌ కమిషనర్‌తో సమావేశం



జోనల్‌ కమిషనర్‌తో అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న బండి రమేష్‌

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ను బుధవారం వివిధ అభివృద్ధి పనులపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు చర్చించారు. అదే విధంగా రాబోయే బతుకమ్మ, దసరా పండుగలకు కావాల్సిన ఏర్పాటు చేయాలని కోరారు. వినాయక చవితి నిమజ్జనానికి సకల సౌకర్యాలతో శాంతియుతంగా జరిగినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి తదితరులు

బాలానగర్‌: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని వినాయక నగర్‌ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో బుధవారం వీడీసీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ అసోసియేషన్‌ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్‌ విభాగం ఏఈ ఆశ, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రాములు పాల్గొన్నారు.

గొందళి సమాజ్‌ను బీసీ జాబితాలో చేర్చాలి



బీసీ కమిషన్‌ చైర్మన్‌కు నివేదిక అందజేస్తున్న ఏక్‌నాథ్‌ దుస్గే తదితరులు

ఆల్విన్‌కాలనీ: గొందళి సమాజ్‌ను బీసీ జాబితాలో చేర్చాలని గొందళి సమాజ్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్‌నాథ్‌ దుస్గే కోరారు. ఈ మేరకు సమాజ్‌ సమగ్ర నివేదికను బీసీ కమిషన్‌ చైర్మన్‌ గోపిశెట్టి నిరంజన్‌కు బుధవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్‌ కార్యాలయంలో సంఘం సభ్యుల పూర్తి వివరాల నివేదిక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనేక సంవత్సరాలుగా తాము బీసీ జాబితాలో చేర్చాలని బీఆర్‌ఎస్‌ పాలనలో అనేక విజ్ఞప్తులు అందజేశామన్నారు. అయినా పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో సందీప్‌, సంజయ్‌, దత్తురావు, అనిల్‌, అశోక్‌, దయానంద్‌, సంజయ్‌, అనిల్‌ కర్వన్‌, మారుతి రావు, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆగని అక్రమ నిర్మాణాలు !

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా

- పార్కింగ్‌ స్థలం కూడా లేకుండా భవనాలు
- పట్టించుకోని అధికారులు



అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణం

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు కాలనీ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ మొదలుకొని కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ వరకు ఆక్రమణలపై అందుతున్న ఫిర్యాదులపై సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినా మూసాపేట సర్కిల్‌ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

66 గజాలు మొదలుకొని..

కేపీహెచ్‌బీ కాలనీలోని ఎకనామికల్లి వీకర్‌ సెక్షన్‌ గృహాలు 66 చదరపు గజాల్లో నిర్మించి కేటాయించారు. కానీ అవి నేడు ఐదు, ఆరంతస్తుల భవనాలుగా దర్శనమిస్తున్నాయి. కనీసం పార్కింగ్‌ స్థలం కూడా లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్న అడ్డుకోకపోవడంతో హౌసింగ్‌ బోర్డు కాలనీ పూర్తి కాంక్రీట్‌ జంగిల్‌ను తలపిస్తుండటం గమనార్హం. ఇక ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ తదితర గృహాల పరిస్థితి సైతం అడ్డూ అదుపులేని ఆరంతస్తుల నిర్మాణాలకు నిలయాలుగా మారాయి.

నోటీసులతోనే సరి..

అక్రమ నిర్మాణాలపై అధికారులకు స్థానికుల ఫిర్యాదులపై స్పందిస్తున్న తీరు నాటకీయతను తలపిస్తుంది. ఫిర్యాదు రాగానే టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు షోకాజ్‌ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అక్రమ నిర్మాణదారులకు అవసరమైన మేరకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రౌండ్‌ప్లస్‌ త్రీ, గ్రౌండ్‌ప్లస్‌ ఫోర్‌ అనుమతులను పొంది ఏకంగా ఐదు అంతస్తులతో పాంటు పెంట్‌ హౌస్‌లను కూడా నిర్మిస్తూ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు అక్రమ నిర్మాణదారులు సవాల్‌ విసురుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సీజ్‌ చేసినా పూర్తి చేస్తున్నారు..

గతంలో ఇక్కడ టౌన్‌ ప్లానింగ్‌ సూపర్‌వైజర్‌గా పని చేసిన అధికారి అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించారు. వసంత్‌నగర్‌ కాలనీ, ధర్మారెడ్డి కాలనీ, గోపాల్‌ నగర్‌ కాలనీ, హౌసింగ్‌ బోర్డు కాలనీల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందడంతో స్పందించి నోటీసులు జారీ చేశారు. తదుపరి కూడా పనులు నిలిపివేయడంతో అక్రమ నిర్మాణాలను సీజ్‌ చేశారు. ఏకంగా పదుల సంఖ్యలో నిర్మాణాలు సీజ్‌ చేయడంతో అక్రమ నిర్మాణదారుల్లో భయం మొదలై కొద్ది రోజుల పాటు నిర్మాణాలను నిలిపివేశారు. అయితే సదరు అధికారి బదిలీ కావడంతో అక్రమార్కులు అవకాశంగా మలుచుకుంటున్నారు. కిందిస్థాయి సిబ్బందికి పెద్ద మొత్తంలో డబ్బులు అందడంతో నిర్మాణాలు మళ్లీ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

> **కఠిన చర్యలు తప్పవు**
>
> మూసాపేట సర్కిల్‌ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలను తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విభాగానికి ఎప్పటికప్పుడు ఫొటోలతో పాటు నివేదికలను పంపుతున్నాం. ఫిర్యాదులు రాగానే నోటీసులు జారీ చేసి స్పీకింగ్‌ ఆర్డర్లు ఇచ్చిన తరువాత కూల్చివేతలకు, సీజ్‌ చేయడానికి తగిన చర్యలు తీసుకునేలా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విభాగం పకడ్బందీగా వ్యవహరిస్తుంది. సీజ్‌ చేసినా పనులు చేస్తున్న వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తున్నాం.
>
> –కరుణాకర్‌, మూసాపేట సర్కిల్‌ టౌన్‌ ప్లానింగ్‌ విభాగం ఏసీపీ

నాయకుల నయా దందా!

సందట్లో సడేమియా అన్నట్లుగా అధికారులకు అక్రమ నిర్మాణదారులకు నడుమ సమన్వయం నడుపుతూ నాయకులు దందా సాగిస్తున్నారు. ఎవరైనా సరే అక్రమ నిర్మాణం మొదలు పెట్టాలంటే అధికారుల కంటే ముందు ఇక్కడి పేరొందిన నాయకులను కలిస్తే చాలు. ఇక నిర్మాణానికి అడ్డు ఉండదు అన్నట్లు చర్చ వినిపిస్తుంది. ఒక రేటు మాట్లాడుకుని ఇక అంత మీరే చూసుకోవాలి అనే స్థాయిలో అక్రమ నిర్మాణాల తంతు కొనసాగుతుండటం సిగ్గుచేటు. అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల నిర్మాణాలకు ఒకలా, ప్రతిపక్ష పార్టీకి చెందిన వారి నిర్మాణాలకు మరోరకమైన ట్రీట్‌మెంట్‌ ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా రోడ్డును తవ్వి..

చేపట్టిందే అక్రమ నిర్మాణం. అధికారులు సీజ్‌ చేసినా, కేసులు పెట్టినా పట్టించుకోకుండా నిర్మాణం పూర్తి చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా రోడ్డును తవ్వి డ్రైనేజీ లైన్‌ కలుపుకోవడం వసంత్‌నగర్‌ కాలనీలో చర్చనీయాంశంగా మారింది. కాలనీ వాసులు, స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

8 నెలల్లో 687 డెంగీ కేసులు !

- జీహెచ్‌ఎంసీ సర్కిళ్లు, పురపాలికల్లోనే అధిక కేసులు
- ఫీవర్‌ సర్వేలో 2,148 మంది జ్వరపీడితులు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు


జిల్లాలో డెంగీ కేసుల నమోదు ఇలా..

డెంగీ కేసులు	– 687 (జీహెచ్‌ఎంసీ పరిధిలో 499, పురపాలికల్లో 188)
చికెన్‌ గునియా	–09
మలేరియా	–03

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చాపకింద నీరులా డెంగీ మహమ్మారి విస్తరిస్తోంది. చికెన్‌గునియా, మలేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి.

◆ జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్‌ సర్కిళ్లు, బస్తీలు, పురపాలక సంఘాలు, కాలనీలు, పట్టణాల్లో ఇంటికొకరు జ్వరం బారినపడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ కిట్లతో నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. ప్లేట్‌లెట్లు (రక్తకణాలు) కొంత తగ్గినా డెంగీగా పేర్కొంటూ.. బాధితులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్రత్యేక చికిత్స పేరిట రూ. లక్షల్లో దండుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

◆ జనవరి నుంచి ఈనెల 8 వరకు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 687 డెంగీ కేసులు నమోదు కాగా.. జీహెచ్‌ఎంసీ పరిధిలో 499, పురపాలికల్లో 188 కేసులు నమోదయ్యాయి. విష జ్వరాలతోబాధపడుతున్న వారు కూడా 2వేలకు పైగా ఉన్నట్లు సమాచారం.



◆ బస్తీలు, పురపాలికల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు లభించకపోవడంతో నగరంలోని ప్రైవేట్‌ ఆసుపత్రులకు పరుగెడుతున్నారు. పురపాలక సంఘాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండటంతో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారి, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

◆ పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టినా.. విషజ్వరాలు మాత్రం ఏమాత్రం తగ్గటం లేదు.

మందుల పంపిణీ..

15 మండలాల పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 11.52 లక్షల ఇళ్లలో 47.21 లక్షల మందికి ఫీవర్‌ సర్వే నిర్వహించగా.. 2,148 మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్యశాఖ గుర్తించి, వారికి మందులు (మెడిసిన్‌) అందజేశారు. ఫీవర్‌ సర్వేలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ వ్యాధి కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అవసరమున్న చోట హెల్త్‌క్యాంపులతో పాటు రక్త నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అడ్డగోలుగా బిల్లులేసి..

తూంకుంటలో ఓ రోగికి జ్వరం రాగా.. చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎర్ర రక్తకణాలు భారీగా పడిపోయాయని ఆందోళనకు గురిచేసి ప్లేట్లెట్లు ఎక్కించాలని నిర్దేశించారు. రోగికి చికిత్స నిమిత్తం రూ.లక్షకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తోంది.

◆ స్థానిక డాక్టర్ల సూచనలతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల బాటపట్టారు. ప్లేట్లెట్ల సంఖ్య తగ్గాయనే నెపంతో రోగుల నుంచి భారీగా వసూలు చేసిన విషయంపై స్థానికులు జిల్లా వైద్యారోగ్యశాఖకు మొరపెట్టుకుంటున్నారు.

అమలుకు నోచుకోని ఆదేశాలు

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు టీ–హబ్‌ కేంద్రాలలో నిర్ధారణ తర్వాతే డెంగీ కేసుల వివరాలు వెల్లడించాలని వైద్యారోగ్యశాఖ ఆదేశాలు జారీచేసినా.. ఇందుకు విరుద్ధంగా జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గగానే డెంగీగా నిర్ధారిస్తూ రోగిని బెంబేలెత్తిస్తున్నారు. ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాల్సిన వైద్యశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డెంగీ ఇక్కడే..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు కూకట్‌పల్లి, గాజులరామారం, మల్కాజిగిరి, ఉప్పల్‌, కాప్రా, కుత్బుల్లాపూర్‌ మున్సిపల్‌ సర్కిళ్లలో బస్తీలతో పాటు బోడుప్పల్‌, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్‌, మేడ్చల్‌ పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, చెత్త,చెదారం దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు డెంగీ, మలేరియా, చికెన్‌ గునియా వ్యాధుల బారినపడుతున్నారు. వాటి నివారణకు ఫాగింగ్‌ చేయలేదనే విమర్శలున్నాయి.

> **నిర్లక్ష్యం చేయొద్దు..**
>
> జ్వరం అనిపిస్తే అలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి. డెంగీ, మలేరియా, చికెన్‌గునియా, టైఫాయిడ్‌ పరీక్షలు ఉచితంగా చేస్తారు. ఫీవర్‌ సర్వేలో జ్వర బాధితులను గుర్తించి మందులు ఇస్తున్నాం.
>
> – డాక్టర్‌ శ్రీదేవి, ప్రోగ్రామ్‌ అధికారి

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌ ర్యాంకింగ్స్‌ పడిపోవడంపై ఏబీవీపీ నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ నేషనల్‌ ఇనిస్టిట్యూషనల్‌ ర్యాంకింగ్‌ ఫ్రేమ్‌వర్క్‌ (ఎన్‌ఐఆర్‌ఎఫ్‌)లో భారీగా ర్యాంకింగ్‌ పడిపోవడంపై ఏబీవీపీ–హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హెచ్‌సీయూ క్యాంపస్‌లోని సౌత్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్ద ఏబీవీపీ నాయకులు నిరసన తెలిపారు. యూనివర్సిటీ ర్యాంకింగ్‌ గతంలో కన్నా గణనీయంగా పడిపోతున్నా పాలకమండలి, విద్యార్థి సంఘం పట్టీపట్టనట్లు వ్యవహరించడం అన్యాయమంటూ నినాదాలు చేశారు.

యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు మరింతగా తీసుకొచ్చేందుకు యత్నించాల్సింది పోయి ఇలా ర్యాంకింగ్స్‌లో పడిపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి ఆయుష్‌కుమార్‌ మాట్లాడుతూ.. హెచ్‌సీయూకు ఎన్‌ఐఆర్‌ఎఫ్‌ ర్యాంకింగ్స్‌లో 2021లో ఓవరాల్‌గా 17వస్థానం, యూనివర్సిటీ పరంగా 9వ స్థానంలో ఉండేదని, 2022లో 20, 10 స్థానాల్లోకి, 2023లో అదే స్థానాలను నిలబెట్టుకున్నారని, 2024లో 25, 17వ ర్యాంకుకు పడిపోయారని, 2025లో ఓవరాల్‌గా 26వ స్థానం, యూనివర్సిటీ కేటగిరిలో 18వ స్థానానికి పడిపోవడం బాధాకరమన్నారు. అధికార యంత్రాంగం, పాలకమండలి స్పందించి భవిష్యత్‌లో ర్యాంకింగ్‌ మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసులకు సన్మానం



సీఐ, ఎస్‌ఐలను సన్మానిస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు



పోలీసులను సన్మానిస్తున్న కాలనీవాసులు

మోతీనగర్‌: వినాయక చవితి, మిలాద్‌ ఉన్‌నబీ పండుగల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో బుధవారం తులసి నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఠాకూర్‌ అంకిత్‌ సింగ్‌ ఆధ్వర్యంలో సీఐ సామల వెంకటరెడ్డి, ఎస్‌ఐలను సన్మానించారు. కార్యక్రమంలో పులిగొళ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, విజయ్‌కుమార్‌, జీవీ ప్రసాద్‌, చిన్ను శ్రీకాంత్‌, దామోదర్‌, కృష్ణ, ఎల్లన్న, శివరాం, శ్రీనివాస్‌చారి, కిషన్‌ సింగ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో గణనాథుల నిమజ్జనం విజయవంతంగా ముగిసింది. దీంతో బుధవారం కూకట్‌పల్లి సీఐ సుబ్బారావు, బాలాజీనగర్‌ సెక్టార్‌ ఎస్‌ఐ శ్రీనివాస్‌ వారి కార్యాలయాల్లో బాలాజీ నగర్‌ డివిజన్‌ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్‌ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్‌, కూకట్‌పల్లి శివాలయం సభ్యుడు శ్రీకాంత్‌ ముదిరాజ్‌, బాలాజీనగర్‌ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు సుల్తాన్‌, సోషల్‌ మీడియా కో ఆర్డినేటర్‌ పవన్‌, బాలాజీ నగర్‌ యూత్‌ కాంగ్రెస్‌ సోషల్‌ మీడియా కో ఆర్డినేటర్‌ అంజిరెడ్డి, గోవింద్‌, తబ్రేష్‌ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఎన్నికలకు ఏర్పాట్లు

రాయదుర్గం: హెచ్‌సీయూలో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఎన్నికలకు నామినేషన్లను దాఖలు చేయడానికి గురు, శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవకాశం కల్పిస్తారు. నామినేషన్ల పరిశీలనను కూడా శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవకాశం కల్పించారు. పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను శనివారం ఉదయం 10 గంటలకు ప్రకటిస్తారు. ఎన్నికల ప్రచారాన్ని ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించారు.

రూ.25 లక్షలతో ఉడాయించిన క్యాబ్‌ డ్రైవర్‌

బాలానగర్‌ : బాలానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓలా కార్‌ డ్రైవర్‌ రూ.25 లక్షలతో పరారైన సంఘటన బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. సిటీ యూనియన్‌ బ్యాంక్‌ సికింద్రాబాద్‌ నుంచి రూ.25 లక్షల నగదు పెట్టెను ఓలాటాక్సీలో బాలానగర్‌ సిటీ యూనియన్‌ బ్రాంచ్‌కి తీసుకొచ్చారు. కారులోల నుంచి క్లర్క్‌, సెక్యూరిటీ కిందికి దిగి నగదు పెట్టను తీసే సమయంలో ఓలా కారు డ్రైవర్‌ నగదుతో పరారయ్యాడు. బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాలనగర్‌ సీఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బాలానగర్‌: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన బాలానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలానగర్‌ ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సుచిత్ర డెయిరీ ఫార్మ్‌ సమీపంలో ఆకారం రంజిత్‌ అనే వ్యక్తి 410 గ్రాముల గంజాయిని విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్‌ టీమ్‌ అధికారులు తనిఖీలు చేశారు. అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ కోసం బాలానగర్‌ ఎక్సైజ్‌ అధికారులకు అప్పగించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐ వెంకటేశ్వర్లు ఎస్‌ఐ మంజు, సిబ్బంది పాల్గొన్నారు.



వీరత్వానికి ప్రతీక ఐలమ్మ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

- ఆమె స్ఫూర్తిని కొనసాగించాలి
- చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించిన నేతలు

కూకట్‌పల్లి: ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, వీరత్వానికి ప్రతీక ఐలమ్మ అని వక్తలు అన్నారు. బుధవారం ఆమె వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. సీపీఎం రాఘవేంద్ర నగర్‌ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ పోరాటం చేసిందన్నారు. సాయుధ పోరాటంలో 4 వేల మంది అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో అంశాంతమ్మ, మాధవి, ప్రమీల, బక్కమ్మ, నాగమణి, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పర్వత్‌నగర్‌ చౌరస్తాలో..

మోతీనగర్‌: పర్వత్‌నగర్‌ చౌరస్తాలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి కార్పొరేటర్‌ సబిహాబేగం పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకుడు మొగిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

ధీరవనిత ఐలమ్మ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ సాయుధ పోరాటంలో తనదైన శైలిలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన చాకలి ధీరవనిత అని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆయన కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్‌, లింగం, సత్తయ్య, సాయి పాల్గొన్నారు.



రాఘవేంద్ర నగర్‌లో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్‌ మాధవరం రంగారావు తదితరులు



పర్వత్‌నగర్‌ చౌరస్తాలో.. మాజీ కౌన్సిలర్‌ సత్యనారాయణ, నాయకులు బాబా, సత్యం



కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌



పర్వత్‌నగర్‌ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం తదితరులు